# మైనస్సే ప్లస్

ఆ కవరు అందుకున్న రాజశేఖరానికి చేతులు వణుకుతున్నాయి. ఇరవైనాలుగేళ్ల కిందటి సంఘటన గుర్తుకొచ్చింది.

"పాపం! పినాకపాణికి ఆడపిల్ల పుట్టింది." జాలిపడుతూ చెప్పాడు ముకుందరావు, నలభై సంవత్సరాల అతని కొలిగ్, ఆఫీసర్. అది విని ముప్ఫై సంవత్సరాల రాజశేఖరం అతనివంక ఆశ్చర్యంగా చూశాడు.

"పాప పుట్టిందానికి సంతోషపడక పాపం అంటున్నారేం?" ఆరా తీశాడు. సదరు పినాకపాణి ఆ ఆఫీసు టైపిస్ట్.

ఆ ప్రశ్నకు ముకుందరావు ముకులించుకుపోతూ అన్నాడు- "అసలే వీడిజీతం గొర్రెతోకలాగా బెత్తెడు. దీనికి తోడు ఆడపిల్ల అంటే మైనస్!"

"ప్లసు - మైనస్ ఆల్జీబ్రాతో అనవసరంగా గుండె గాబరా చేసుకోకుండా సంతానం కలిగిందానికి ఆనందించాలి!" రాజశేఖరం ఖండిస్తూ చెప్పాడు.

"ఆ( ! ఆనందం - రాబోయే ఖర్చుల్ని తలుచుకుంటే విషాదంగా మారుతుంది. కట్నంతో కళ్ళు తిరుగుతాయి!" భవిష్యత్తునిఊహిస్తూ చెప్పాడు.

"ప్లస్సుకు ఈ ఖర్చులు లేవా?" ఎగతాళిగా అన్నాడు రాజశేఖరం.

"ఆ(! ఉండచ్చు - ఈ ఖర్చులో సగం వుండచ్చు. కానీ.... ప్లసు ఈజ ప్లస్సు! అతనికైన ఖర్చు అంతా వడ్డీతో సహా పెళ్ళిలో కట్నం కింద వసూలు చేస్తాడు." ముకుందరావు అద్దాలు తుడుచుకుంటూ చెప్పేశాడు.

రాజశేఖరం ఇంకేం మాట్లాడలేకపోయాడు. అతను కాస్త గింజుకోవడానికి అర్థంవుంది. అతనికి ఒక బాబుతోపాటు ఇద్దరు పాపలున్నారు.

రాజశేఖరం కళ్లుతుడుచుకుని ఆ కవరును తెరిచాడు - జ్ఞాపకాలను మూసివేసి. కవరులో ఉత్తరం .... దానితో పాటు పదివేల డాలర్లకు డ్రాఫ్టు!

నీటితో తడిసిన కన్ను అక్షరాల వంక పరుగుతీసింది.

"డియర్ డాడీ! ఆడపిల్లనని ఈ సంఘం ఎగతాళిచేసేది. ఎంత వద్దను కున్నా మీపైన కూడా దాని ప్రభావం పడింది. మీకు తెలియకుండానే - అన్నయ్యకు నాకంటే ఎక్కువ ఆత్మీయత పంచడం.... సంపాదన ఖర్చు పెట్టడం చేశారు. ఎప్పుడైనా నేను ఎదురు తిరిగితే అమ్మ - ఒసే నీ కట్నంకింద దాస్తు న్నాంలే అని సముదాయించేది.

మీ తారతమ్యమే నన్నీస్థితికి తెచ్చింది. పట్టుదలగా చదివి పైకొచ్చాను. పైచదువులకు అమెరికాకు వచ్చాను.

నా అదృష్టం కొద్దీ ఇక్కడ మంచి పార్టుటైమ్ జాబ్‌లు రెండు దొరికాయి. నా ఆరునెలల సంపాదనలో నేను దాచి.... మీకు కొంత పంపిస్తున్నాను. ముందు నన్ను అమెరికా పంపడానికి మీరు చేసిన అప్పు తీర్చండి. ఆ తర్వాత కన్న రుణం నేను తీర్చుకుంటాను. నెలనెలా కొంత పంపిస్తాను.

అమ్మకు నా నమస్కారాలు .చెల్లాయిని కూడా బాగా చదివించండి - మీ మైనస్ మీ - అనూరాధ."

"రాజ్యలక్ష్మీ!" గట్టిగా పిలిచి సోఫాలో కూర్చున్నాడు. ఆమె పరుగెత్తుకుంటూ వచ్చింది-

కవరు అందించాడు.

ఆమె కళ్ళవెంట జలజల కన్నీళ్ళు కారాయి.

"ఏవండీ - మీ కొడుకు ఉద్యోగంలో చేరి రెండుసంవత్సరాలైంది. వాడు బొంబాయికి పోయిన రెండేళ్ళల్లో కనీసం నాలుగు ఉత్తరాలైనా రాయలేదు. ఒక వందయినా పంపలేదు. " అంది.

"అవునే ... వాడు మైనస్ - నాకూతురు ప్లస్సు!" చెప్పాడు రాజశేఖరం.

"మీకేమైందండీ?!" ఆశ్చర్యంగా చూసింది రాజ్యలక్ష్మి.

"రోజులు మారాయి. అనురాగం, బాధ్యత తెలిసిన సంతానం కలిగితే ప్లస్సు - మమకారం లేని - స్వార్థం కలిగిన సంతానం కలిగితే అది మైనస్!" ఆప్యాయంగా కూతురు రాసిన కవరును ముద్దు పెట్టుకుంటూ చెప్పాడు రాజశేఖరం.

(స్వాతి సపరివార పత్రిక)

